## క్లుప్తంగా

### సచివాలయ కార్యదర్శికి అభినందన



మహేష్‌ను అభినందిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

డాబాగార్డెన్స్: రాజస్థాన్ రాష్ట్రంలోని జైసల్మేర్ నగరంలో నిర్వహించిన 'ది హెల్ రేస్ రన్'లో పాల్గొన్న జీవీఎంసీ 34వ వార్డు అచ్చియ్యమ్మపేట సచివాలయ కార్యదర్శి మొండి మహేష్‌ను జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ శుక్రవారం తన ఛాంబర్లో అభినందించారు. గత నెల 14, 15 తేదీల్లో రాజస్థాన్ రాష్ట్రంలోని జైసల్మేర్ నుంచి లాంగేవాలా వరకు (ఇండో-పాక్ బోర్డర్) 160 కిలోమీటర్లు ది హెల్ రేస్‌ను 25 గంటల్లో పూర్తి చేశారని, అతి పెద్ద రన్‌లో పాల్గొని విశాఖ నగరానికి గుర్తింపు తెచ్చారని కమిషనర్ అభినందించారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ రాధారాణి, డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: తెలుగునాడు వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సంఘం-2025 క్యాలెండర్ ఆవిష్కరణ శుక్రవారం రేసవానిపాలెంలో ఉన్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జరిగింది. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రాధారాణి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు నాడు వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసాచారి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎం.వెంకటలక్ష్మి, జిల్లా అధ్యక్షుడు నగేష్ పట్నాయక్, కార్యదర్శి పి.రత్నం, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు, కార్యదర్శి రామానాయుడు, తెలుగు నాడు జోనల్ కార్యదర్శి సత్యానంద్, చలం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారంలో ఉద్యోగుల పాత్ర కీలకం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆర్జేడీ విజయ భాస్కర్

విశాఖ విద్య: ఉపాధ్యాయుల సర్వీసుపరమైన సమస్యలు పరిష్కరించడంలో కార్యాలయ ఉద్యోగులదే కీలక పాత్ర అని విద్యాశాఖ ఆర్జేడీ విజయ భాస్కర్ అన్నారు. ఏపీ పాఠశాల విద్య సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన క్యాలెండర్‌ను సంఘం నాయకులతో కలసి శుక్రవారం ఆర్జేడీ విజయ భాస్కర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధిలో కార్యాలయ ఉద్యోగుల భాగస్వామ్యం ఎంతో కీలకమైనదన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించి ఎలాంటి సర్వీసు పరమైన సమస్యలైనా, వాటికి తగిన పరిష్కారం చూపేలా చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పి. ఆనంద్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు ఎం. శైలజా కుమారి, కోశాధికారి కృష్ణ చైతన్య, అసిస్టెంట్ డైరెక్టర్ బి.వి. నరసింగరావు, ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.



విస్తరణ

# ఊసే లేదు



టౌన్ కొత్తరోడ్డు వద్ద నుంచి నిర్మాణం జరగని రహదారి



నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన ఫుట్‌పాత్, కాలువ



ఏవీఎన్ కళాశాల వరకు నిర్మించిన ఫుట్‌పాత్

- వన్‌టౌన్‌లో ఆగిపోయిన పనులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు, వ్యాపారులు
- టీడీఆర్‌ల కోసం నిరీక్షణ

జగదాంబ: నిత్యం రద్దీగా ఉండే వన్‌టౌన్ రహదారి విస్తరణకు అనేక సంవత్సరాలుగా ప్రజలు నిరీక్షించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నాయకులు రహదారిని విస్తరిస్తాం అని చెప్పేవారే కానీ కచ్చితంగా ఎంత విస్తరణ జరుగుతుందో, ఎప్పుడు జరుగుతుందో చెప్పకపోవడంతో వ్యాపారులు భయాందోళనలతో ఉండేవారు. చివరకు 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వంద అడుగుల రహదారి వెడల్పునకు ప్రాతిపాదించింది. అయితే అంత మేర విస్తరణ జరిగితే వ్యాపారులు, స్థానికులు నష్టపోతారని భావించి 60 అడుగులకు మాత్రమే విస్తరించాని నిర్ణయించడంతో అన్ని వర్గాల వారు సంతోషించారు.

**వెంట వెంటనే నిధుల విడుదల..**

రహదారి విస్తరణ పనులకు నివేదికలు అందజేయడమే తడువు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.12 కోట్లు మంజూరు చేసింది. సుమారు పదేళ్లుగా తర్జన భర్జన పడుతున్న రహదారితో పాటు కాలువలు, ఫుట్‌పాత్‌లు కూడా నిర్మించేందుకు పూనుకున్నారు. దీంతో రహదారి విస్తరణ పనులు మొదలయ్యాయి. మరో పక్క కాలువల నిర్మాణం కూడా ప్రారంభించారు.

**అంతలోనే..**

రహదారి పనులు శరవేగంగా జరుగుతున్న నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల బాంబు పేలి ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ఈ పనుల్లో ముందుగా జగదాంబ నుంచి టర్నర్ చౌల్ట్రీ వరకు రోడ్లు ఇరువైపులా వెడల్పు, పూర్ణామార్కెట్ వరకు ఇరువైపుల కల్వర్టులు కూడా పూర్తి చేశారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ఎక్కడి పనులు అక్కడే అగిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు పైగా కావస్తున్నా ఇప్పటికీ ఆ రహదారి పనులు ముందుకు సాగలేదు. దీంతో ఆ రోడ్డు రాళ్లు తేలి.. శిథిలావస్థలో ఉన్న కల్వర్టులతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు.



టర్నర్ చౌల్ట్రీ వరకు నిర్మించిన రహదారి

**చిరువ్యాపారులకు దెబ్బ..**



వన్‌టౌన్ ప్రధాన రహదారిలో పెద్ద వర్తకులతో పాటు చిరు వ్యాపారులు కూడా ఉన్నారు. వీరిలో చాలా మంది ఫుట్‌పాత్‌లపై బతుకుతున్నారు. ఫుట్‌పాత్‌ల నిర్మాణం కోసం కాలువలను తవ్వి వదిలేయడంతో చిరువ్యాపారులు నష్టపోయారు. – సుబ్రహ్మణ్యం, చిరు వ్యాపారి, వన్‌టౌన్

**త్వరలోనే ఇస్తాం...**



రహదారి విస్తరణలో నష్టపోయిన బాధితులకు నష్టపరిహారంగా టీడీఆర్‌లు ఇచ్చాం. మిగిలిన వారి కోసం డాక్యుమెంటేషన్ పనులు జరుగుతున్నాయి. వారికి కూడా త్వరలోనే టీడీఆర్‌లు ఇస్తాం. –ఎం.మల్లయ్యనాయుడు, జెడ్సీ, జీవీఎంసీ జోన్-4

**నిరాశలో మూడొందల మంది..**

వన్‌టౌన్ రహదారి విస్తరణలో ఎక్కువ మంది బంగారం వర్తకులు, బట్టల వ్యాపారులు ఉన్నారు. ఇలా స్థలాలు, దుకాణాలు కోల్పోయి మూడొందల మంది నిరాశ్రయులయ్యారు. జీవీఎంసీ నిబంధనల ప్రకారం ఆస్తి నష్టపోయిన వారికి ఇవ్వాల్సిన టీడీఆర్‌లు ఇప్పటికీ ఇవ్వలేదు. డాక్యుమెంటేషన్ తీసుకుని కార్యాలయం చుట్టూ తిప్పకుంటున్నారని పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ రహదారిలో పూర్తిగా దుకాణాలు కోల్పోయిన కొందరు తమ బతుకులు రోడ్డున పడ్డాయని వాపోతున్నారు.

**వడ్డీలు కట్టలేకపోతున్నాం..**



టీడీఆర్‌లు ఇవ్వకుండా ఏడు నెలలుగా కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారు. అప్పులు చేసి దుకాణాలు నిర్మించాం. వడ్డీలు కట్టలేకపోతున్నాం. అధికారులు సమస్యను అర్థం చేసుకుని ఇప్పటికైనా టీడీఆర్‌లు ఇవ్వాలి.

– వెంకటరావు, భవన యాజమాని, పందువుల్లల సందు

**రోడ్డున పడ్డాం..**



రోడ్డు విస్తరణ కోసం దుకాణాలు ఖాళీ చేసి ఇచ్చాం. జీవీఎంసీ దుకాణాలు తొలగించింది. కానీ పూర్తి చేయలేదు. ఏవీఎన్ కళాశాల డౌన్ నుంచి పూర్తిగా నిర్మాణ పనులు వదిలేశారు. మా దుకాణాల నిర్మాణం పూర్తి కాలేదు. రోడ్డున పడ్డాం.

– రాము, భవన యాజమాని, వన్‌టౌన్

### కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..**

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు.

### 12న యూత్ మారథాన్

మురళీనగర్: స్వామి వివేకానందుడి జయంతి సందర్భంగా ఈ నెల 12న మారథాన్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పి.శ్రీనివాస్ తెలిపారు. స్వామి వివేకానంద ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆ రోజు ఉదయం 5.30గంటలకు 5కే రన్ నిర్వహిస్తామన్నారు. గాజువాక డిపో సమీపంలోని స్వామి వివేకానంద విగ్రహం నుంచి మల్కాపురం వరకు యూత్ రన్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ రన్‌లో పాల్గొనే వారికి టీ-షర్ట్, మెడల్, గూగుల్ బ్యాగ్ విత్ గూడీ ఐటమ్స్, ఆన్ రోడ్ రిఫ్రెష్‌మెంట్స్, ఉదయం టిఫిన్ అందిస్తామన్నారు. ఆసక్తి గలవారు https://youthmarathon2025.fun లింక్‌లో తమ పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

## ప్రజా ఉద్యమాలే 'సత్యాగ్రహం' చిత్రానికి ప్రేరణ



మాట్లాడుతున్న సత్యారెడ్డి

డాబాగార్డెన్స్: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపేందుకు చేసిన ప్రజా ఉద్యమాలు, నాయకుల త్యాగాలు ఉక్కు సత్యాగ్రం చిత్రానికి ప్రేరణ అని చిత్ర నిర్మాత, దర్శకుడు, హీరో సత్యారెడ్డి చెప్పారు. నగరంలోని చిత్రాలయ ఐనాక్స్‌లో ఉక్కు సత్యాగ్రహం చిత్రాన్ని శుక్రవారం సీపీఎం నాయకులు, ఉద్యమ నాయకులు, స్టీల్‌ప్లాంట్ యూనియన్ నాయకులు, చిత్ర నటీనటులతో కలిసి వీక్షించారు. అనంతరం హీరో సత్యారెడ్డి మీడియాతో మాట్లాడారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో 32 మంది చేసిన ప్రాణ త్యాగాన్ని ప్రపంచానికి తెలియజేస్తూ 37 రోజుల కిందట 150 థియేటర్లలో ఈ చిత్రం విడుదలయిందన్నారు. ఇప్పటికీ అనేక చోట్ల విజయవంతంగా ప్రదర్శించబడుతుందన్నారు. పక్క రాష్ట్రాల్లో కూడా ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తున్నారని, సినిమా విజయానికి అదే కారణమన్నారు. నటుడు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ప్రాణ త్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గంగారామ్, ఆర్‌కేఎస్‌వీ కుమార్, స్టీల్‌ప్లాంట్ భూ నిర్వాసితుల సంఘం ప్రతినిధి నర్సింగరావు, ఉమ్మడి అప్పారావు, కాంగ్రెస్ నాయకుడు వజ్జిపర్తి శ్రీనివాసరావు, మజ్జి దేవిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## 'కార్మికుల పొట్ట కొట్టొద్దు'



ధర్నా చేస్తున్న జీవీఎంసీ కార్మికులు

సీతమ్మధార: ముందస్తు నోటీసు ఇవ్వకుండా, నోటి మాటతో అర్ధంతరంగా జీవీఎంసీ కాంట్రాక్ట్/ఔట్ సోర్సింగ్ కార్మికులను నిలుపుదల చేయడం అన్ ఫెయిర్ లేబర్ ప్రాక్టీస్ కింద చట్ట విరుద్ధం అని జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు తెలిపారు. గాంధీ పార్క్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు మాట్లాడుతూ మరణించిన లేదా పదవీ విరమణ చేసిన కార్మికుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. పర్మినెంట్ ఉద్యోగులకు 58 ఏళ్ల రిటైర్మెంట్ వయసు ఉన్నప్పుడు కాంట్రాక్టు/ఔట్ సోర్సింగ్ కార్మికులకు 58 సంవత్సరాలు అమలు చేశారని అన్నారు. 2025 జనవరి ఒకటి నుండి 60 సంవత్సరాలు పూర్తి అయ్యాయని కొంత మంది కార్మికులను నిలిపివేయడం సరైనది కాదన్నారు. పెరుగుతున్న జనాభా ఆధారంగా కార్మికుల పెరుగుదల లేదన్నారు. అర్ధంతరంగా నిలిపివేసిన పారిశుధ్యం, నీటి సరఫరా, ఇతర విభాగాల కార్మికులను తిరిగి కొనసాగించాలని జీవీఎంసీ కమిషనర్‌కి వినతిపత్రం సమర్పించారు. ఈ ధర్నాలో గౌరవ అధ్యక్షుడు పి. వెంకటరెడ్డి, అధ్యక్షుడు టి. నూకరాజు, గొలగాని అప్పారావు, ముద్దాడ ప్రసాద్, జేఆర్ నాయుడు, ఒమ్మి అప్పారావు, గణేష్, ఈశ్వరరావు, సీర రమణ, వెంకట్రావు, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలి



విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్

అల్లిపురం: విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలని ప్రముఖ ఫిజియాలజిస్ట్ మహాత్మాగాంధీ మున్సిపల్ హై స్కూలు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం ఆయన మోటివేషన్ క్లాసులు నిర్వహించారు. పరీక్షలకు ఏ విధంగా సిద్ధం కావాలి, ఆత్మవిశ్వాసంతో పరీక్షలను ఎలా ఎదుర్కోవాలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 5 గంటలకు నిద్ర లేవాలని, యోగా, మెడిటేషన్ ఏకాగ్రతతో చేయాలన్నారు. అనంతరం రివిజన్ చేయటం వల్ల సబ్జక్టుపై పూర్తి పట్టు సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు. ప్రతి రోజు ఒక స్కూలు విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## స్టీల్‌ప్లాంట్‌పై ప్రధాని మోదీ ప్రకటన చేయాలి

సీతమ్మధార: ప్రధాని మోదీ విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ప్రకటన చేయాలని సీఐటీయూ కంచరపాలెం జోన్ నాయకుడు ఎం.ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు జీవీఎంసీ గాంధీ పార్కులో జరుగుతున్న స్టీల్‌ప్లాంట్ దీక్షా శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటీకరణ నిర్ణయం విరమించుకునే వరకు పోరాడుతామని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యమం ఒక వ్యక్తికి సంబంధించినది, ఒక సంస్థకు సంబంధించినది కాదని స్పష్టం చేశారు. 32 మంది ప్రాణత్యాగంతో ప్లాంట్ సాధించుకున్నాం అన్నారు. 1367వ రోజుకు చేరుకున్న ఈ కార్యక్రమంలో ఏయూ మాజీ ప్రొఫెసర్ సూరప్పుడు, ఒ.అప్పారావు, భానుమూర్తి, ఎ.రవి, సీఐటీయూ నాయకులు ఎస్.సోమేశ్వరరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

## హార్బర్‌లో సమస్యలు పరిష్కరించాలని వినతి



వాసుపల్లి గణేష్‌కుమార్‌ను కలిసిన అసోసియేషన్ అధ్యక్షుడు కొండబాబు తదితరులు

మహారాణిపేట: ఫిషింగ్ హార్బర్‌లో సమస్యలు పరిష్కరించాలని విశాఖ కోస్టల్ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బర్రి కొండబాబు కోరారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హార్బర్‌కు సంబంధించిన పలు విషయాలపై చర్చించారు. ఆయిల్ సబ్సిడీ అంశం చాలా కాలంగా పెండింగ్‌లో ఉందన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఎమ్మెల్యేను కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారని ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘాల నాయకులు సుధ, శ్యాం, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## యువకుడిని రక్షించిన పోలీసులు



యువకుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న మహారాణిపేట పోలీసులు

అల్లిపురం: రాజమండ్రికి చెందిన 23 సంవత్సరాల కొంగల యేసు అనే యువకుడు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ఆర్కే బీచ్‌లో ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో బీచ్ పెట్రోలింగ్ పోలీసులు అతడిని రక్షించి మహారాణిపేట పోలీసు స్టేషన్‌కు తరలించారు. అతని వద్ద నుంచి కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకుని వారికి సమాచారం అందజేశారు. యువకుడిని సీఐ బాసు భాస్కరరావు అతని తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

## వాసుపల్లికి శుభాకాంక్షల వెల్లువ



వాసుపల్లికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

అల్లిపురం: మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు పలువురు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త జాలారిపేట, పెయిందొరపేట గ్రామాలకు చెందిన పలువురు మత్స్యకార నాయకులు కాసరపు వాసు, సరుకుల శ్రీనివాస్, చింతపల్లి జోగిరాజు, మధు, జగన్నాథరావు, గురునాథరావు, శివకుమార్, నూకరాజు, రాంబాబు తదితరులు వాసుపల్లిని ఆయన కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ తోటి మత్స్యకారుడిగా మత్స్యకారులకు, నియోజకవర్గం ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. అదేవిధంగా వాసుపల్లికి 30వ వార్డు యువజన నాయకుడు తాడి రవితేజ ఆధ్వర్యంలో మాణిక్యాలరావు, దశమంతుల చిన్ని, వద్దాది దిలీప్, వేణుగోపాల్, రాము, గోవింద్ తదితరులు వాసుపల్లిని కలసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## సంరక్షకుల చెంతకు శ్రీకాకుళం మహిళ



శ్రద్ధా టీం సభ్యులతో ఆరాధన

సీతమ్మధార: పోలీసులు ఇచ్చిన సమాచారంతో 4వ పట్టణ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఆరాధన అనే మహిళను పట్టుకున్నట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు శుక్రవారం తెలిపారు. ఈమె ఖైనీ, గుట్కాలకు బాగా అలవాటు పడిందన్నారు. మూడు నెలలు షెల్టర్‌లో ఉంచి చికిత్స అందజేసినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు ఆమె సొంతూరు శ్రీకాకుళం తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. అక్కడ గ్రామస్తులు ఇచ్చిన సమాచారం ప్రకారం ఆమె తల్లిదండ్రులు ఇద్దరూ చనిపోయారని, ఆమె గత 20 ఏళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతుందని తెలిపారు. ఆరేళ్ల పాటు విశాఖ ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో కూడా చికిత్స చేయించారని, భర్త వదిలేసి వెళ్లిపోయాడని, సోదరుడు పూర్తిగా మద్యానికి బానిస అయిపోయాడని తెలిపారు. ఆమె గ్రామంలో ఒంటరిదై తిరుగుతూ ఉంటే ఒక చర్చి పాస్టర్ చేరదీసి వైజాగ్‌లో ఉంటున్న సోదరి దగ్గరకు పంపించారని చెప్పారు. గ్రామస్తుల నుండి గార్డియన్ సత్యవతి నంబర్ తీసుకుని మళ్లీ విశాఖలో ఈమెను అప్పగించినట్లు తెలిపారు.

## 7న విజయవాడలో 'విద్యుత్ బస్సుల'పై సదస్సు



మాట్లాడుతున్న సీతాలక్ష్మి

డాబాగార్డెన్స్: విద్యుత్ బస్సుల నిర్వహణను ఆర్టీసీకే అప్పగించాలని కోరుతూ ఈ నెల 7న విజయవాడలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సదస్సును విజయవంతం చేయాలని ఏపీపీటీడీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ విశాఖ రీజినల్ కమిటీ కార్యదర్శి సీతాలక్ష్మి పిలుపునిచ్చారు. జగదాంబ జంక్షన్ సమీపంలోని నండూరి ప్రసాదరావు భవన్‌లో శుక్రవారం ఫెడరేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కేఆర్ కుమార్, జిల్లా అధ్యక్షుడు సూర్యనారాయణతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. 2029 నాటికి ఆర్టీసీలో ప్రస్తుతం ఉన్న బస్సుల స్థానంలో పూర్తిగా ప్రైవేట్ విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టడానికి జీవో 88 ద్వారా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని చెప్పారు. పీఎంఈ బస్సు స్కీమ్ ద్వారా రాష్ట్రంలోని 11 నగరాల్లో 750 విద్యుత్ బస్సులు ప్రవేశపెట్టనున్నారని, దీని ఫలితంగా కార్పొరేట్లకు లాభాలు, ప్రజలకు భారాలు మిగులుతాయన్నారు. 46 వేల మంది శాశ్వత ఉద్యోగుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ వాతావరణ కాలుష్యంలో ఆర్టీసీ బస్సుల వాటా కేవలం 0.02 శాతం మాత్రమేనన్నారు. 0.08 శాతం అత్యల్ప ప్రమాద రేటుతో సౌకర్యవంతమైన ప్రయాణం, తక్కువ ఖర్చుతో ప్రయాణ సౌకర్యాన్ని ఆర్టీసీ కల్పిస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అందించాలంటే 3 వేల బస్సులు అవసరమవుతాయన్నారు. ప్రజా రవాణాను ప్రోత్సహించడం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు. కొత్తగా ప్రవేశపెట్టే 750 విద్యుత్ బస్సులను ప్రైవేట్ సంస్థలకు ఇవ్వకుండా.. నేరుగా ఆర్టీసీకే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలన్నీ చర్చించేందుకు ఈ నెల 7న విజయవాడ ఆర్టీసీ హౌస్‌లో జరిగే సదస్సులో సిబ్బంది, ప్రజలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

## 12 మంది జూదరుల అరెస్టు

సీతమ్మధార: సీతమ్మధారలో బహిరంగ ప్రదేశంలో జూదం ఆడుతున్న వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసి నాలుగో పట్టణ పోలీసులకు శుక్రవారం అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. సీతమ్మధార రాధాకృష్ణ లేఅవుట్ వద్ద గల ధారకొండ ప్రాంతంలో ఒక ఫిర్యాదుదారుడు ఇచ్చిన సమాచారం మేరకు, సిటీ టాస్క్ ఫోర్స్ సిబ్బంది దాడులు చేసి 13 మంది జూదగాళ్లను అరెస్టు చేశారు. నిందితులంతా కూలిపనులు చేస్తూ, జీవనం సాగిస్తున్నవారే. వారి నుంచి రూ.31,100 స్వాధీనం చేసుకున్నారు. వారిలో సీతమ్మపేటకు చెందిన ఒకరు పరారయ్యాడని పోలీసులు తెలిపారు. నాలుగో పట్టణ సీఐ సత్యనారాయణ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### మహిళా సాధికారతకు నిలువెత్తు రూపం

కంచరపాలెం: మహిళా సాధికారతకు నిలువెత్తు రూపం సావిత్రిబాయి పూలే అని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు అన్నారు. ఆడపిల్లలు చదువుకోవాలని పోరాడిన మహనీయురాలు పూలే అని కొనియాడారు. ఊర్వశి కూడలి దళిత సేన కార్యాలయంలో దళితసేన రాష్ట్ర అధ్యక్షుడు పాత్రేటి పెంటారావు పిలుపు మేరకు సావిత్రి బాయి పూలే 194వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దళిత సేన నగర మహిళా కన్వీనర్ గొల్లమాల మీనా, కామేశ్వరరావు, ఝాన్సీరాణి, సీతారామ్, రాణి తదితరులు పాల్గొన్నారు.